సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం, 1, జూన్, 2025



రైతుల గుండె 'కోత'
ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు పలు రకాల కోతలతో పాటు హమాలీ చార్జీల భారం పడుతోంది. 8లో



లక్ష్యానికి దూరంగా..
ఈ ఏడాది కూడా తునికాకు లక్ష్యం నెరవేరలేదు. జిల్లాలో 35,100 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యానికి 14,313 బ్యాగులు మాత్రమే సేకరించారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం 38° / 26°
జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

గర్భిణులకు భరోసా

సండే స్పెషల్



తన సతీమణి శ్రద్ధాపాటిల్‌కు డెలివరీ చేసిన వైద్యులు, ఉద్యోగులతో కలెక్టర్ జితేష్ వి పాటిల్ (ఫైల్)

- పాల్వంచ సీహెచ్‌సీలో నెలకు 50కి పైగా ప్రసవాలు
- ప్రత్యేక ఆపరేషన్ థియేటర్ ద్వారా కాన్పులు
- ఇటీవల కలెక్టర్ సతీమణి సైతం ఇక్కడే డెలివరీ

పాల్వంచ: గర్భిణులకు సేవలు అందించడంలో పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రి(సీహెచ్‌సీ) జిల్లా ఆస్పత్రికి పోటీపడుతోంది. గతంలో ఇక్కడికి పేద, మధ్య తరగతి ప్రజలే ఆరోగ్య పరీక్షల నిమిత్తం వచ్చేవారు. ఇటీవల మౌలిక వసతులు మెరుగు పడడంతో అన్ని వర్గాల వారు వస్తున్నారు. పాల్వంచ, ములకలపల్లి, బూర్గంపాడు తదితర మండలాల పరిధిలోని సుమారు 20 పీహెచ్‌సీల్లో వైద్యం పొందే వారు మెరుగైన చికిత్స కోసం ఇక్కడికే వస్తున్నారు. ఇక గర్భిణులైతే ఈ ఆస్పత్రిలో కాన్పు కోసం మరింతగా ఆసక్తి చూపిస్తున్నారు. నిపుణులైన వైద్యులు, ఆపరేషన్ థియేటర్, వార్డు రూంలు సౌకర్యవంతంగా ఉండడంతో ఇక్కడికి క్యూ కడుతున్నారు. మిడ్‌వైఫ్ సిస్టమ్‌తో సేవలందిస్తుండడం మరో విశేషం.



ఎదురుకాళ్లతో జన్మించిన కవలలతో మిడ్‌వైఫ్ సుజాత (ఫైల్)

గర్భిణులకు వాకింగ్, ఎక్స్‌ర్‌సైజ్‌లు చేయిస్తూ సాధారణ ప్రసవాల దిశగా వైద్య సిబ్బంది ప్రోత్సహిస్తున్నారు. ఆస్పత్రిలో సేవలను పరిశీలించిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్.. ఇటీవల తన సతీమణి శ్రద్ధా పాటిల్‌ను సైతం ప్రసవం నిమిత్తం ఇక్కడికే తీసుకురావడం విశేషం.

ఎదురుకాళ్లతో కవలల జననం
పాల్వంచ సీహెచ్‌సీలో ఇటీవల ఎదురుకాళ్లతో కవలలు జన్మించగా సిబ్బంది శాయశక్తులా కృషి చేసి సాధారణ ప్రసవం చేశారు. రేపల్లెవాడకు చెందిన జూపల్లి పల్లవి రెండో కాన్పు కోసం ప్రభుత్వ ఆస్పత్రికి రాగా.. కవల పిల్లలు ఉన్నారని గ్రహించిన వైద్యులు సుఖ ప్రసవం కోసం ఆమెతో వ్యాయామం చేయించారు. ఈ క్రమంలో మే 5న నార్మల్ డెలివరీ ద్వారా ఇద్దరు మగ పిల్లలకు ఆమె జన్మనిచ్చింది. ఎదురుకాళ్లతో.. అందులో కవలలు ఉండగా క్లిష్టమైనప్పటికీ సాధారణ ప్రసవం చేయడం విశేషం. దీంతో వైద్యురాలు అనూష, వేమూరి సుజాతతో సిబ్బందిని పలువురు అభినందించారు.

మరిన్ని వసతులకు ప్రతిపాదనలు..
ఆస్పత్రిలో మరిన్ని వసతుల కోసం రూ.10 కోట్లు విడుదల చేయించేందుకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రత్యేక కృషి చేస్తున్నారు. దీనిపై కలెక్టర్ సైతం దృష్టి సారించారు. గతంలో పేషంట్ల కోసం రూ.3 లక్షలతో కుర్చీలు, కారిడార్‌లో ఫ్యాన్‌లు ఏర్పాటు చేశారు. డెలివరీలకు వచ్చే వారి కోసం ప్రత్యేక గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు చేయనున్నారు. నాలుగు నార్మల్ గదులు, నాలుగు ఏసీ రూమ్‌లు ఏర్పాటు చేయనున్నారు.



పరీక్షల కోసం ఆస్పత్రికి వచ్చిన గర్భిణులు

ఆందోళన దూరం చేయాలి



గర్భిణుల్లో డెలివరీ పట్ల ఉండే ఆందోళనను ముందు దూరం చేయాలి. మా వద్దకు వారు గర్భం దాల్చినట్లు గుర్తించిన వెంటనే వారికి సూచనలు చేస్తూ జాగ్రత్తలను వివరిస్తాం. ప్రతి నెలా పరీక్షలు, నెలలు నిండే కొద్దీ ఆహారం, వ్యాయామం వంటి విషయాలపై అవగాహన కల్పిస్తాం. డెలివరీ చేసేందుకు మా ఆస్పత్రిలో సౌకర్యాలు సైతం బాగున్నాయి. – డాక్టర్ అనూషా లక్ష్మి, గైనకాలజిస్ట్

ఆహ్లాదకర వాతావరణం



ప్రభుత్వ ఆస్పత్రి అంటే పరిశుభ్రత, పరిసరాలు బాగుండవనే అపోహ ఎక్కువ మందిలో ఉంటుంది. అయితే ఇక్కడి వాతావరణం ఆహ్లాదంగా, శుభ్రంగా ఉండేలా కృషి చేస్తున్నాం. గర్భిణులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. డెలివరీ తర్వాత వారు డిశ్చార్జ్ అయ్యేంత వరకు సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.
– రాంప్రసాద్, ఆస్పత్రి సూపరింటెండెంట్

గర్భిణుల సంఖ్య గణనీయంగా పెరిగింది



పాల్వంచ సీహెచ్‌సీకి ప్రసవాల కోసం వచ్చే గర్భిణుల సంఖ్య ఇటీవల గణనీయంగా పెరిగింది. ఇక్కడి వాతావరణం నచ్చి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కూడా తన సతీమణిని డెలివరీ కోసం చేర్పించారు. ఇక్కడి సిబ్బంది ఎన్నో క్లిష్టమైన ప్రసవాలు కూడా చేశారు. సీహెచ్‌సీకి కాయకల్ప అవార్డులు సైతం దక్కాయి.
– రవిబాబు, డీసీహెచ్‌ఎస్

ప్రపంచవ్యాప్తంగా విస్తరణకు చర్యలు



ఏరియా వర్క్‌షాపును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే కూనంనేని, పక్కన సీఎండీ బలరామ్, జీఎం శాలేంరాజు తదితరులు

- లాభదాయకమైన టెక్నికల్ మినరల్స్ తవ్వే ఆలోచనలో సింగరేణి
- జీఎం కార్యాలయం, ఏరియా వర్క్‌షాప్ ప్రారంభోత్సవాల్లో డిప్యూటీ సీఎం భట్టి

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సింగరేణి సంస్థకు మంచి రోజులు వచ్చాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో సంస్థ పదేళ్లు వెనక్కు వెళ్లిందని, కొత్త గనులు రాకపోవడం, విస్తరణ చేపట్టకపోవడమే దీనికి కారణమని చెప్పారు. కొత్తగూడెంలో రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించిన వర్క్‌షాప్‌ను, ఆ తర్వాత జీఎం కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్తగూడెం ఏరియాలో వీకే – 7 ఓసీకి పర్యావరణ అనుమతులు వచ్చాయని, త్వరలో రెండో దశకు అనుమతులు రానున్నాయని తెలిపారు. సింగరేణి సంస్థ ప్రపంచ వ్యాప్తంగా విస్తరించేలా చర్యలు చేపడతామన్నారు. 136 సంవత్సరాల ఘన చరిత్ర గల ఈ సంస్థ కేవలం బొగ్గుపైనే ఆధారపడకుండా లాభదాయకమైన టెక్నికల్ మినరల్స్ తవ్వే ఆలోచనలో ఉన్నామని, రాబోయే 30 ఏళ్లలో మరో 22 మిలియన్ టన్నుల బొగ్గును అదనంగా వెలికితీసేందుకు కొత్త గనులు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. సింగరేణి కార్మికులు ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోతే రూ.కోటి ప్రమాద బీమా వర్తింపజేస్తున్నామని, దీంతోపాటు వారసులకు తగిన ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు.

ప్రొటోకాల్ పాటించలేదని ఎమ్మెల్యే ఆగ్రహం..
కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యేగా తన అధ్యక్షతన జరగాల్సి ఉందని, అంతేకాక ఫ్లెక్సీలో తన ఫొటో ముద్రించకుండా ప్రొటోకాల్ విస్మరించారని కూనంనేని సాంబశివరావు సింగరేణి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యేను కాదని ఏ పనీ చేయొద్దని, భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కావొద్దని సూచించారు. ఇకనైనా పనితీరు మార్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సింగరేణి సీఎండీ బలరామ్, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గడిపెల్లి కవిత, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, నేషనల్ కో ఆర్డినేటర్ కొప్పుల రాజు, ఎస్పీ రోహిత్‌రాజు, సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణరావు, కొప్పుల వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, మిరియాల రంగయ్య, కొత్తగూడెం ఏరియా జీఎం శాలేంరాజు తదితరులు పాల్గొన్నారు.



సింగరేణి క్వార్టర్లను ప్రారంభించిన సీఎండీ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో నిర్మించిన 14 ఎంఏ టైప్ క్వార్టర్లను సీఎండీ బలరామ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్పొరేట్ కార్యాలయంలో పనిచేసే జీఎంలకు క్వార్టర్లు సరిపోనందున నూతనంగా బంగ్లోస్‌లో 14 క్వార్టర్లను నిర్మించామని చెప్పారు. రైటర్‌బస్తీ, బర్మాక్యాంపులో 57 ఏంఏ అపార్ట్‌మెంట్, 96 ఎంసీ, 46 ఎండీ టైప్ క్వార్టర్లు నిర్మాణంలో ఉన్నాయని, వాటిని కూడా త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రామయ్యకు పునర్వసు పట్టాభిషేకం



పట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి శనివారం పునర్వసు నక్షత్రం సందర్భంగా పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా జరిపారు. అలాగే స్వామివారి మూల మూర్తులకు సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

2న సాంస్కృతిక కార్యక్రమాలు
భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 2న శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎల్.రమాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు చిత్రకూట మండపంలో ఈ వేడుకలు ఉంటాయని, కళాకారులు, కళాభిమానులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పొగాకు రహిత సమాజానికి కృషి చేయాలి




ప్రతిజ్ఞ చేయిస్తున్న న్యాయమూర్తి

సూపర్‌బజార్(కొత్తగూడెం): పొగాకు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సరిత అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టులో శనివారం న్యాయమూర్తులు, న్యాయ శాఖ ఉద్యోగులు, కోర్టు డ్యూటీ పోలీసులతో ఈ మేరకు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పొగాకు వాడడంతో రోగాల బారిన పడుతున్నారని, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు. పొగాకు ఉత్పత్తులతో కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. పొగాకు, సిగరెట్, ఆల్కహాల్ వినియోగంతో గుండె జబ్బులు, నోటి, లంగ్ కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.కిరణ్‌కుమార్, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి రవికుమార్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.రాజమల్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీవీడీ లక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఏఓ జె.కిరణకుమార్ పాల్గొన్నారు.

వైద్యులకు మంత్రి దామోదర అభినందన

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం ఏరియా ఆస్పత్రి వైద్యులకు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఎక్స్ ద్వారా అభినందనలు తెలిపారు. రెండు నెలల క్రితం పురుగుమందు తాగి ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందిన మడకం శిరీష అనే యువతి కోలుకోగా.. స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు శుక్రవారం ఆమెను పరామర్శించడంతో పాటు వైద్యులు చూపిన శ్రద్ధ తదితర వివరాలు ఆరా తీశారు. కాగా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కూడా యువతిని రక్షించిన ఏరియా ఆస్పత్రి వైద్యులను అభినందించారు. తాజాగా శనివారం మంత్రి రాజనర్సింహ తన ఎక్స్ అకౌంట్ ద్వారా డీసీహెచ్‌ఎస్ రవిబాబు, ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ, పల్మనాలజిస్ట్ జగదీశ్‌తో పాటు సిబ్బందిని అభినందించారు.

జీపీ కార్యదర్శే ట్రాక్టర్ డ్రైవర్!



దుమ్ముగూడెం: గ్రామపంచాయతీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోగా పాలకవర్గాలు సైతం లేకపోవడంతో కార్యదర్శులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇందుకు అవసరమైన రాళ్లు, ఇసుక తీసుకొచ్చేందుకు జీపీల ట్రాక్టర్లు వినియోగిస్తున్నారు. కానీ దుమ్ముగూడెం మండలం సర్వాపురం జీపీ ట్రాక్టర్ డ్రైవర్‌కు జ్వరం వచ్చి శనివారం విధులకు హాజరు కాలేదు. దీంతో పంచాయతీ కార్యదర్శి యాకూబ్ ఇలా ట్రాక్టర్ డ్రైవర్‌గా మారాడు.

పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపరుస్తాం

ఐటీడీఏ పీఓ రాహుల్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పీఓ

భద్రాచలం: పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే నాటికి గిరిజన శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న స్కూళ్లన్నింటినీ అన్ని వసతులతో సిద్ధం చేస్తామని, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి గురుకులాల ప్రిన్సిపల్ సెక్రటరీ సీతాలక్ష్మి, ట్రైబల్ వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డితో కలిసి గిరిజన సంక్షేమ ప్రత్యేక సెక్రటరీ శరత్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, మంచాలు, కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం పీఓ రాహుల్ మాట్లాడుతూ.. పాఠశాలల పునఃప్రారంభం సమయానికి అన్ని వసతులతో విద్యార్థులకు స్వాగతం పలికేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వీసీలో డీడీ మణెమ్మ, ఈఈ చంద్రశేఖర్, డీఈ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మ్యూజియంపై శ్రద్ధ వహించాలి..
గిరిజన మ్యూజియం అభివృద్ధికి మరింత శ్రద్ధ వహించాలని పీఓ రాహుల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. శనివారం తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మ్యూజియం అభివృద్ధికి కేంద్రం రూ.కోటి నజరానా ప్రకటించటం హర్షణీయమని అన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఈఈ చంద్రశేఖర్, ఏసీఎంఓ రమణయ్య, ఉద్యానవన శాఖ సిబ్బంది మాలి బాబురావులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, గురుకులం ఆర్సీఓ అరుణ కుమారి, ఏఓ సున్నం రాంబాబు, ఏటీడీఓలు అశోక్ కుమార్, చంద్రమోహన్, రాధమ్మ, మేనేజర్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కరోనాపై అప్రమత్తంగా ఉండాలి

పాల్వంచ: కరోనా వైరస్ మళ్లీ వేగంగా వ్యాపిస్తున్న క్రమంలో ఉద్యోగులు తగు జాగ్రత్తలు, సూచనలు పాటించాలని కేటీపీఎస్ ఏడో దశ సీఈ కె.శ్రీనివాసబాబు శనివారం ఆదేశాలు జారీ చేశారు. విధులకు హాజరయ్యే ప్రతీ ఉద్యోగి తప్పనిసరిగా మాస్క్ ధరించాలని, భౌతిక దూరం పాటించాలని సూచించారు. తరచూ చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని, శానిటైజ్ చేయాలని పేర్కొన్నారు.

3వ తేదీ వరకు పుస్తకాల పంపిణీ

డీఈఓ వెంకటేశ్వరా చారి



పుస్తకాల పంపిణీని పరిశీలిస్తున్న డీఈఓ

కొత్తగూడెంఅర్బన్: ఈ ఏడాది పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇందు కోసం ఈనెల 3వ తేదీ నాటికి జిల్లాలోని అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరా చారి తెలిపారు. శనివారం పాత కొత్తగూడెంలోని గోదాం నుంచి రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలు, గిరిజన ఆశ్రమ పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాకు 5,08,400 పుస్తకాలు అవసరం ఉండగా, ఇప్పటివరకు 4,54,925 పుస్తకాలు చేరాయని వివరించారు. ఇప్పటికే 59 శాతం పుస్తకాలను పంపిణీ చేశామని, మిగిలిన రెండు రోజుల్లో చేరవేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఎంఈఓ ప్రభుదయాళ్ పాల్గొన్నారు.

అవసరాలు తెలుసుకునేందుకే..

ఆదివాసీ సమ్మేళనంలో డిప్యూటీ సీఎం భట్టి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మీనాక్షీ నటరాజన్, పక్కన పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యేలు

పాల్వంచరూరల్/పాల్వంచ : గిరిజనుల అవసరాలు ఏంటో తెలుసుకుని ఆ వర్గ నాయకులను ఒక చోట చేర్చేందుకే ఆదివాసీ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో అత్యధిక గిరిజన జనాభా గల ఈ జిల్లాలో ఈ వేడుక నిర్వహించడం హర్షణీయమని అన్నారు. పాల్వంచ మండలం కిన్నెరసాని క్రీడా పాఠశాలలో నిర్వహిస్తున్న ఆదివాసీ సమ్మేళనం చివరి రోజైన శనివారం భట్టితో పాటు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు నల్లమల డిక్లరేషన్‌ను తీసుకొచ్చామన్నారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. కిన్నెరసాని గిరిజన ఆశ్రమ పాఠశాలల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. తండాలు, గూడేలను మొదట అభివృద్ధి చేసింది ఇందిరాగాంధీ హయాంలోనని గుర్తు చేశారు. మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ.. ఆదివాసీ గిరిజనుల మనుగడను దెబ్బతీసేలా కేంద్రప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య మాట్లాడుతూ ఆదివాసీలను ఐక్యం చేసి గిరిజన చట్టాలపై పూర్తి అవగాహన తీసుకొచ్చేందుకే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ఆ తర్వాత మూడు రోజుల సమ్మేళనంలో పాల్గొన్న ప్రతినిధులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయగా గిరిజన మహిళలు నృత్యాలతో నాయకులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రాఘురాంరెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, వైరా, డోర్నకల్, సత్తుపల్లి ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, రామచంద్రునాయక్, మట్టా రాగమయి, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, సమ్మేళన్ ఇన్‌చార్జ్ రాహుల్ బాల్, నాయకులు చందాలింగయ్యదొర, కోనేరు చిన్ని తదితరులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ స్థానిక కేటీపీఎస్ గెస్ట్‌హౌస్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించి పార్టీ వ్యవహారాలపై దిశానిర్దేశం చేశారు.

ముందుకు సాగలేక.. వెనక్కి వెళ్లలేక



ఖమ్మం బైపాస్ రోడ్డులో శనివారం గంటల తరబడి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. భారీ వాహనాలు మెల్లగా కదులుతుండడంతో తెలంగాణ తల్లి సర్కిల్ నుంచి చెన్నై షాపింగ్‌మాల్ వరకు మూడు గంటల పాటు బారులుదీరాయి. పోలీసులు చేరుకున్నప్పటికీ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి శ్రమించాల్సి వచ్చింది. తెలంగాణ తల్లి సర్కిల్ విస్తీర్ణం ఎక్కువగా ఉండడం.. ట్రాఫిక్ సిగ్నల్ గ్రీన్ లైట్ సమయం తక్కువగా ఇస్తుండగా.. ఐదారు భారీ వాహనాలు మూల తిరిగి వెళ్లేలోగా రెడ్ లైట్ పడుతోంది. శనివారం కూడా ఇదే సమస్యతో ట్రాఫిక్ జామ్ ఏర్పడిందని లారీల డ్రైవర్లు వాపోయారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఖుర్షీద్ సేవలు అభినందనీయం

అదనపు కలెక్టర్ వేణుగోపాల్



ఖుర్షీద్ దంపతులను సత్కరిస్తున్న అదనపు కలెక్టర్

చుంచుపల్లి: జిల్లా సహకార శాఖ అధికారిగా సుదీర్ఘ కాలం పనిచేసిన సయ్యద్ ఖుర్షీద్ సేవలు ఎనలేనివని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. డీసీఓ ఉద్యోగ విరమణ సందర్భంగా కలెక్టరేట్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విధుల్లో చేరిన నాటి నుంచి సహకార రంగ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని అన్నారు. తోటి సిబ్బందితో స్నేహంగా ఉంటూనే క్రమశిక్షణతో విధులు నిర్వహించేలా పర్యవేక్షించారని చెప్పారు. ఉద్యోగ విరమణ పొందిన ఖుర్షీద్ శేష జీవితం సజావుగా సాగాలని, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, టీఎన్జీవోస్ అధ్యక్షులు అమరనేని రామారావు, టీజీఓస్ జిల్లా అధ్యక్షుడు సంగం వెంకటపుల్లయ్య, ఇన్‌చార్జ్ డీసీఓ శ్రీనివాస్, కవి, సామాజికవేత్త కోమాకుల సీతారాములు, మద్దెర్ల రమేష్, సహకార శాఖ చైర్మన్‌లు, ఖుర్షీద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబూరావు



రిజిస్టర్లను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబూరావు

టేకులపల్లి: విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయాల్లో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబూరావు స్పష్టం చేశారు. మండలంలోని విత్తన, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆమోదిత విత్తనాలను, నిర్దేశించిన ధరల్లో మాత్రమే విక్రయించాలని చెప్పారు. యూరియా అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

బీజేపీ ఆధ్వర్యంలో శోభాయాత్ర



మాట్లాడుతున్న బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

చుంచుపల్లి: బీజేపీ ఆధ్వర్యంలో రాణి అహల్యాబాయి జయంతి ఉత్సవాల సందర్భంగా శనివారం కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుంచి లక్ష్మీదేవిపల్లి వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ అహల్యాబాయి 300 ఏళ్ల క్రితమే మహిళా సాధికారతకు కృషి చేశారని అన్నారు. నాయకులు జీవీకే మనోహర్, రంగాకిరణ్, జల్లారపు శ్రీను, గూడ విజయ, పైడిపాటి రవీందర్, కుంజా ధర్మ, తిమ్మిరి నరేంద్రబాబు, శీలం విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటిన రైతు



అదనంగా ఇచ్చిన డబ్బును తిరిగి ఇస్తున్న రైతు

సుజాతనగర్: జొన్నలు కొనుగోలు చేసిన వ్యాపారి అదనంగా డబ్బులు చెల్లించగా, ఆ సొమ్ము తిరిగి చెల్లించి ఓ రైతు తన నిజాయితీని చాటుకున్నాడు. నర్సింహసాగర్ గ్రామానికి చెందిన బానోత్ భీముడు 50 కిలోల జొన్నలను విక్రయించేందుకు డేగలమడుగులోని మన్నెపల్లి రాణి ఇంటికి వెళ్లాడు. కిలో ధాన్యం రూ.50 చొప్పున విక్రయించాడు. కాగా రైతుకు రూ. 2500 ఇవ్వాల్సి ఉండగా రూ.20,500 వ్యాపారి రైతుకు ఇచ్చింది. రైతు ఇంటికి వెళ్లి చూసుకోగా రూ.18 వేలు అదనంగా ఉండటంతో ఆ సొమ్మును తిరిగి వ్యాపారికి వద్దకు వచ్చి ఇచ్చివేశాడు.

కామారెడ్డి రైతులకు అవగాహన

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట: కామారెడ్డి జిల్లా రైతులు శనివారం అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని ఆయిల్ పామ్ తోటలను సందర్శించారు. సుమారు 150 మంది రైతులు నారంవారిగూడెం వద్దగల ఆయిల్‌ఫెడ్ పామాయిల్ మొక్కల నర్సరీ, దమ్మపేట మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీతోపాటు ఆయిల్‌పామ్ సాగు క్షేత్రాలను పరిశీలించారు. తోటల పెంపకం, సాగు పద్ధతులు, దిగుబడి తదితర వివరాలు స్థానిక రైతులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హిందూస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్ సంస్థ మేనేజర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్వాలిటీ కంట్రోల్ కమిటీ పరిశీలన

భద్రాచలంటౌన్: పట్టణంలోని మదర్ థెరిస్సా డిగ్రీ కళాశాలలో కాకతీయ విశ్వవిద్యాలయం వరంగల్ ఎన్‌ఏపీసీ క్వాలిటీ కంట్రోల్ విభాగం బృందం సభ్యులు శనివారం సందర్శించారు. బోధనా ప్రమాణాలు తదతర అంశాలపై ఆరా తీశారు. ఉన్నత విద్యలో ప్రమాణాలు పెంపొందిస్తూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ కమిటీ డైరెక్టర్ వెంకటరమణ, కరస్పాండెంట్ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

దమ్మపేట: ఎదురుగా వస్తున్న బైక్‌ను ఆటో ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలైన ఘటన దమ్మపేటశివారులో శనివారం చోటు చేసుకుంది. దమ్మపేట గ్రామానికి చెందిన పందేటి చినవెంకయ్య(55), కుమారి దంపతులు బైక్‌పై ఉపాధి హామీ పనికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఇండేన్ గ్యాస్ గోదాం సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో చినవెంకయ్యకు తీవ్రగాయాలయ్యాయి. అతని భార్య స్వల్పంగా గాయపడింది.

రైతుల గుండె'కోత'

అన్నదాతపై హమాలీ చార్జీలు

- ఏళ్ల తరబడి రీయింబర్స్ చేయని ప్రభుత్వం
- క్వింటాకు రూ.100 నష్టపోతున్న రైతులు
- రైతులకు రూ.కోట్ల బకాయిలు



కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యాన్ని లారీల్లో ఎక్కిస్తున్న హమాలీలు (ఫైల్)

బూర్గంపాడు: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకునే రైతులకు చాలా రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తేమశాతం ఉందని మిల్లర్లు కాంటాల్లో కోత పెడుతున్నారు. రోజుల తరబడి ధాన్యాన్ని దిగుమతి చేసుకోవటం లేదు. దీనికి తోడు హమాలీ చార్జీల భారం కూడా రైతులపైనే పడుతోంది. అది కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మితే హమాలీ చార్జీలు రైతులే చెల్లించాలి. ప్రైవేట్ వ్యాపారులకు రైతులు ధాన్యం అమ్మితే వారే హమాలీ చార్జీలు చెల్లిస్తారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులు ముందుగా హమాలీ చార్జీలు చెల్లిస్తే తరువాత ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుందని చెబుతుంటారు కానీ, ఏళ్ల తరబడి బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే రైతులు క్వింటాకు రూ.100 హమాలీ చార్జీ చెల్లించాలి. ఓ రైతు వంద క్వింటాళ్ల ధాన్యాన్ని అమ్మితే రూ.10 వేలు హమాలీలకు ముందుగానే చెల్లించాలి. మద్దతు ధర కోసం రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వెళ్తే అక్కడ హమాలీ చార్జీల రూపంలో మద్దతు ధరలో రూ.100 కోత పడుతుందని రైతులు వాపోతున్నారు. క్వింటాకు నాలుగైదు కిలోల తరుగు పేరుతో మిల్లర్లు కోత పెడుతున్నారు.

ఏళ్లుగా ఇదే దుస్థితి..

జిల్లాలో రైతులు ప్రతి వానాకాలం సీజన్‌లో సుమారు 1.40 లక్షల ఎకరాల్లో, యాసంగిలో 80 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రతీ సీజన్‌లో 280 వరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. రైతులకు మద్దతు ధర చెల్లించేందుకే ఈ కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్, జీసీసీ, డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తోంది. ధాన్యం కొనుగోలు చేసి ప్రభుత్వానికి సరఫరా చేసినందుకు గాను ఈ సంఘాలకు క్వింటాకు రూ.32 వరకు ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ నగదును కొంత సమయం తీసుకుని చెల్లించినప్పటికీ.. రైతులు ముందుగా చెల్లించిన హమాలీ చార్జీలపై ఎలాంటి కదలిక ఉండటం లేదు. కొనుగోళ్ల సమయంలో ధాన్యంలో తేమశాతం ఉందని, తాలు, మట్టి ఉన్నాయని, తుర్పారా సరిగా లేదనే కారణాలతో కాంటాల్లో కూడా కోత విధిస్తున్నారు. అటు కాంటాల్లో కోత, ఇటు హమాలీల చార్జీల చెల్లింపుతో వాత పెడుతూ రైతులను రెండువిధాలా నష్టపరుస్తున్నారు. దాదాపు తొమ్మిదేళ్లుగా రైతులకు హమాలీ చార్జీలు రీయింబర్స్ చేయాల్సి ఉందని, వెంటనే నిధులు విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలాఉండగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్ణీత హమాలీ చార్జీలు కూడా ఉండటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచిన హమాలీ చార్జీలను చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ పరిధిలో ఉంది

ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులు ముందుగా చెల్లిస్తున్న హమాలీ చార్జీలను రీయింబర్స్ చేసే అంశం ప్రభుత్వ పరిధిలో ఉంది. ఎనిమిదేళ్లుగా రైతులకు ఇవ్వాల్సిన హమాలీ చార్జీలు వారి ఖాతాల్లో జమ కాలేదు. ఏటా పౌరసరఫరాలశాఖ రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను సమగ్రంగా ప్రభుత్వానికి నివేదిస్తోంది.

–త్రినాథ్‌బాబు, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్

లక్ష్యానికి దూరంగా..

జిల్లాలో భారీగా తగ్గిన తునికాకు సేకరణ

- నిర్దేశిత లక్ష్యంలో 40.77 శాతమే
- టెండర్లలో జాప్యం, అకాల వర్షాల ప్రభావం



కిన్నెరసాని అభయారణ్యంలో తునికాకు సేకరిస్తున్న గిరిజనులు



వర్షానికి తడవడంతో వదిలేసిన తునికాకు కట్టలు

పాల్వంచరూరల్: ఈసారి తునికాకు సేకరణ లక్ష్యం నెరవేరలేదు. గతేడాది కంటే కూడా సేకరణ తగ్గింది. గడిచిన సంవత్సరం లక్ష్యంలో 41.7 శాతం సేకరిస్తే ప్రస్తుత సంవత్సరం 40.77 శాతం మాత్రమే సేకరించారు. మే నెల రెండో వారం నుంచి సేకరణ ప్రారంభంకాగా కేవలం పక్షం రోజులే గిరిజనులు తునికాకు సేకరించారు. అప్పటి నుంచి అకాల వర్షాలు రావడం, కొందరు ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లడంతో తునికాకు సేకరణ లక్ష్యం నెరవేరలేదని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలోని ఆరు డివిజన్లలో ఈ ఏడాది సేకరణ లక్ష్యం 35,100 స్టాండర్డ్ బ్యాగులుగా నిర్దేశించగా, 14,313 స్టాండర్డు బ్యాగులు మాత్రమే సేకరించారు. మే 31 వరకు సేకరణ జరగాల్సి ఉండగా, ఐదు రోజుల ముందే సేకరణ నిలిచిపోయింది. కాగా గతేడాది 35,300 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యానికి 13,478.66 స్టాండర్డు బ్యాగుల తునికాకు సేకరించారు.

డివిజన్ల వారీగా తునికాకు సేకరణ వివరాలు

డివిజన్	లక్ష్యం	సేకరణ	శాతం
కిన్నెరసాని అభయారణ్యం	3,200	1,117	35
భద్రాచలం	9,700	4,338	43
ఇల్లెందు	10,600	2,550	20
మణుగూరు	5,400	3,952	73
పాల్వంచ	2,300	356	15
కొత్తగూడెం	3,900	2,000	20
మొత్తం	35,100	14,313	40.77

కారణాలు ఇవే..

అకాల వర్షాలు, టెండర్ల ప్రక్రియలో జాప్యంతో కూలీలు ఆకు సేకరణపై ఆసక్తి చూపలేదు. వర్షాల కారణంగా ఆకు చీడ పట్టి పనికిరాకుండా పోయింది. దీంతో నాణ్యమైన ఆకు కూడా దొరకలేదు. ఏటా ఏప్రిల్ నెలాఖరులో తునికాకు సేకరణ ప్రారంభిస్తారు. అప్పటి నుంచి మే వరకు సుమారు 30 నుంచి 35 రోజుల వరకు ఆకు సేకరిస్తారు. కానీ గత వేసవిలో మాత్రం టెండర్లలో తీవ్ర జాప్యం జరిగింది. దీంతో మే నెల రెండో వారంలో సేకరణ ప్రారంభమైంది. కేవలం పది, పదిహేనురోజులు మాత్రమే ఆకు సేకరణ జరిగింది. దీనికితోడు అకాల వర్షాలు కూడా ప్రభావం చూపాయి. కాగా గతంలో 50 ఆకుల కట్టకు రూ.3 చొప్పున చెల్లిస్తే ఈసారి రూ.3.30 చొప్పున కూలీలకు చెల్లించారు.

సేకరణ తగ్గింది



ఈసారి అకాల వర్షాలకు తోడు కూలీలు ఆకుసేకరణపై అంతగా ఆసక్తి చూపలేదు. దీంతో లక్ష్యం నెరవేరలేదు. గతంలో తునికాకు సేకరణ అంటే ఏజెన్సీ గ్రామాల్లో ప్రజలు ముఖ్యంగా గిరిజనులు అధిక సంఖ్యలో వచ్చేవారు. ఇప్పుడా పరిస్థితి కన్పించడంలేదు.

–కట్టా దామోదర్‌రెడ్డి, పాల్వంచ డివిజన్ అధికారి

ఈసారి నిరాశే..



తునికాకు సేకరణ ఆలస్యంగా మొదలు పెట్టడం, అకాల వర్షాలతో అనుకున్నంతగా సేకరించలేకపోయాం. గతేడాది సీజన్‌లో రూ.15 వేల నుంచి 20వేలు ఆదాయం లభించింది. ఈసారి కేవలం రూ.4 వేల నుంచి 5వేల వరకు ఆదాయం పొందాం. ఈసారి నిరాశే మిగిలింది.

–మక్కటి ముత్తయ్య, రేగులగూడెం

పొగాకు క్యూరింగ్‌లో మార్పులు రావాలి



మాట్లాడుతున్న మాగంటి శేషు మాధవ్

ఐసీఏఆర్–ఎన్ఐఆర్‌సీఏ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషు మాధవ్

అశ్వారావుపేటరూరల్: పొగాకు పంట క్యూరింగ్‌లో విప్లవాత్మక మార్పులు రావాలని, రైతులు గ్యాస్ ఆధారిత క్యూరింగ్ విధానానికి మారాలని ఐసీఏఆర్-ఎన్ఐఆర్‌సీఏ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషు మాధవ్ అన్నారు. శనివారం అశ్వారావుపేట మండల పరిధిలోని తిమ్మాపురంలో రైతు కొడవాటి వాసు వ్యవసాయ క్షేత్రంలో ఐసీఏఆర్-ఎన్ఐఆర్‌సీఏ, ఎల్‌టీసీఎల్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన గ్యాస్ ఆధారిత పొగాకు బ్యారన్ పనితీరుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొగాకు క్యూరింగ్ సమయంలో బ్యారన్లలో వినియోగించే వివిధ రకాల కలపతో కాలుష్యం పెరుగుతోందని, పొగాకులో నాణ్యత తగ్గిపోతోందని తెలిపారు. జనరల్ మేనేజర్ వర్నేకర్, చీఫ్ మేనేజర్ లలిత, పొగాకు బోర్డు విస్తరణ మేనేజర్ సురేఖ, బోర్డు ఆర్ఎం ప్రసాద్, ప్రాజెక్టు హెడ్ డాక్టర్ ఎల్‌కే ప్రసాద్, డాక్టర్ ఐవీ సుబ్బయ్య, టి.వెంకటేష్, టి.రమేష్, దేవానంద్, ఆయిల్‌ఫెడ్ డీఓ నాయుడు రాధాకృష్ణ, పామాయిల్ ఫ్యాక్టరీ మేనేజర్ నాగబాబు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలపై సొసైటీ సభ్యుల ఆగ్రహం



ఇసుక తవ్వకాలను అడ్డుకుంటున్న గిరిజనులు

చర్ల: మండలంలోని కొయ్యూరు గ్రామ పంచాయతీలో సొసైటీ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా ఇసుక తవ్వకాలను చేపట్టారు. దీంతో సొసైటీ సభ్యులు శనివారం నిరసన తెలిపారు. ఇసుక తవ్వకాలు చేపట్టిన ప్రాంతానికి చేరుకుని పనులను అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. సమాచారం ఇవ్వకుండా తవ్వకాలు ఎందుకు చేపట్టారని ప్రశ్నిస్తే తమపై దాడి చేశారంటూ సుందరయ్యకాలనీ, చీమలపాడుకు చెందిన గిరిజనులు ఆరోపించారు. సొసైటీలోని సభ్యులందరికీ సమాచారం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ సొసైటీలో కొందరు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ఇసుకను కాంట్రాక్టర్లకు దోచిపెట్టేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఇసుకను మాన్యువల్ పద్ధతిలో తీయాల్సి ఉన్నప్పటికీ భారీ యంత్రాల ద్వారా తీస్తూ తమ పొట్ట కొడుతున్నారని, దీనిని తక్షణమే నిలిపివేయించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ



లారీ ఢీకొని విరిగిన విద్యుత్ స్తంభం

అశ్వారావుపేటరూరల్: అదుపుతప్పి ఓ లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఘటన శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఏపీ వైపు నుంచి అశ్వారావుపేట వైపు విద్యుత్ సామగ్రి లోడుతో వస్తున్న లారీ సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఆగింది. ఈ క్రమంలోనే రోడ్డు పక్కన పార్కింగ్ చేసేందుకు లారీని రివర్స్ చేస్తున్న క్రమంలో అదుపుతప్పి వెనుక ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగి, వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచింది. లారీ డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునఃరుద్ధరించారు.

నాటుసారా స్వాధీనం

పాల్వంచ: ఆటోలో ఆరు లీటర్ల నాటుసారా తరలిస్తుండగా పట్టణంలోని దమ్మపేట సెంటర్ వద్ద ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భూక్యా వీరేందర్ అనే వ్యక్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కుక్కునూరు మండలం వేలేరు గ్రామం నుంచి తీసుకొస్తుండగా పట్టుకున్నట్లు సీఐ ఎం.ప్రసాద్, ఎస్ఐ సరిత తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలి

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి



మాట్లాడుతున్న చావా రవి

కొత్తగూడెంఅర్బన్/జూలూరుపాడు: తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్య పొందాలని, ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి, కార్యదర్శి బి.రాజు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల పెంపు కోసం ఆ సంఘం ఆధ్వర్యంలో ప్రచార జాతా నిర్వహిస్తున్నారు. శనివారం కొత్తగూడెం రైల్వే స్టేషన్, బస్టాండ్, పోస్ట్ ఆఫీస్ సెంటర్, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో, జూలూరుపాడులో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నారని, విశాలమైన తరగతి గదులు, ఆటస్థలం ఉన్నాయని చెప్పారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం, వారానికి మూడు సార్లు గుడ్లు, రాగిజావ అందిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఫీజుల భారం తగ్గించుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో విద్యా వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోందని, తల్లిదండ్రుల ఆకాంక్షలను ప్రైవేట్ విద్యాసంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయని ఆరోపించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, నాయకులు బి.లక్ష్మ, బి.మంగీలాల్, ఎదళ్లపల్లి వీరస్వామి, బి శంకర్, గురుమూర్తి, ఆర్ నాగజ్యోతి పాల్గొన్నారు.

జీవనంలో సగపాలు

జీవన ప్రమాణాలు మెరుగుపర్చేది పాడిపరిశ్రమ

- పౌష్టికాహారంలో పాలకే ప్రాధాన్యత
- ఉమ్మడి జిల్లాలో మెరుగ్గా పాల ఉత్పత్తి
- త్వరలోనే ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటు
- నేడు ప్రపంచ పాల దినోత్సవం



పాల సేకరణను పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంవ్యవసాయం: పాలు, పాల ఉత్పత్తులకు ఎంతో ప్రాధాన్యం ఉంది. పాలు ఆరోగ్యకరమైన ఆహారం. జీవనోపాధి, సమాజ ప్రయోజనాలకు పాడి పరిశ్రమ ఎంతగానో దోహదపడుతుంది. జీవన ప్రమాణాలను మెరుగుకు పాడి పరిశ్రమ ప్రధాన భూమిక పోషిస్తుందనటంలో సందేహం లేదు. మానవాళి జీవనంలో పాలు ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. ఈ నేపథ్యాన ఆదివారం అంతర్జాతీయ పాల దినోత్సవం సందర్భంగా కథనం.

పాల ఉత్పత్తికి పెరుగుతున్న ప్రాధాన్యం

మనిషి ఆరోగ్యం పాల ఉత్పత్తులపై ఆధారపడటంతో ఆయా ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యాన ప్రభుత్వాలు పాడి పరిశ్రమకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. వ్యవసాయ పరంగా ముందంజలో ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పాడి పరిశ్రమపైనా రైతులు మక్కువ కనబరుస్తునానరు. ఉమ్మడి జిల్లాలో గేదె పాలు ఉత్పత్తి ఎక్కువగా ఉండగా.. ప్రభుత్వం 25 వేల లీటర్ల సామర్థ్యంతో పాడి పరిశ్రమ (విజయ డెయిరీ)ను నిర్వహిస్తోంది. ఖమ్మంలోని ఈ పరిశ్రమకు అనుబంధంగా కామేపల్లి, మధిర, ఎర్రుపాలె, కల్లూరు, సత్తుపల్లి, ఇల్లెందు, కొత్తగూడెంలలో 5 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన పాల శీతలీకరణ కేంద్రాలు నిర్వహిస్తున్నారు.

227 గ్రామాల్లో పాల సేకరణ

పాల శీతలీకరణ కేంద్రాల ఆధారంగా ఉమ్మడి జిల్లాలో 30 మండలాల్లోని 227 గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఈ పాల సేకరణ కేంద్రాల్లో 3,025 మంది ఉత్పత్తి చేసే పాలను విక్రయిస్తున్నారు. ఖమ్మం జిల్లా పాల ఉత్పత్తిదారుల నుంచి ప్రస్తుతం రోజుకు 7,750 లీటర్ల పాలను సేకరిస్తుండగా, కొత్తగూడెం జిల్లా నుంచి 2,500 లీటర్ల పాలను సేకరిస్తున్నారు. ఈ మొత్తం నుంచి ఖమ్మం జిల్లాలో 1,000 లీటర్లు, కొత్తగూడెం జిల్లాలో 2,600 లీటర్లు విక్రయిస్తున్నారు. విజయ పాల ఉత్పత్తులకు పెరుగుతున్న ప్రాధాన్యం ఆధారంగా ఉమ్మడి జిల్లాలో 6 డెయిరీ పార్లర్లు నడుస్తున్నాయి. వెన్నశాతం ఆధారంగా పాడి పరిశ్రమ రైతుల నుంచి పాలను సేకరిస్తోంది. ప్రభుత్వం ఇటీవల పాల ధరను పెంచింది. 10 వెన్నశాతం ఉన్న గేదె పాల ధరను రూ.80 నుంచి 84.60కు, వెన్నశాతం 7 ఉన్న గేదె పాల ధర రూ.56 నుంచి రూ.59.50లకు పెంచింది.

ఇందిరా డెయిరీతో పెరగనున్న ఉత్పత్తి

రాష్ట్ర ప్రభుత్వం మధిర నియోజకవర్గంలో ఇందిరా మహిళా డెయిరీల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. సభ్యులైన మహిళలకు రెండు గేదెల చొప్పున సబ్సిడీపై అందించనున్నారు. మధిర, ఎర్రుపాలెం, ముదిగొండ, చింతకాని, బోనకల్ మండలాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా చేపట్టారు. ఇప్పటికే ఎర్రుపాలెంలో బల్క్ మిల్క్ కేంద్రం ఉండగా, బోన కల్, చింతకాని, మధిర, ముదిగొండల్లో ఒక్కో మండలంలో 2,500ల నుంచి 5 వేల సామర్థ్యం కలిగిన బల్క్‌మిల్క్ సెంటర్ల ఏర్పాటు ప్రతిపాదనలు చేశారు.

ఆరోగ్యం.. శక్తి

పాలలో మన శరీరానికి అవసరమైన కాల్షియం, మెగ్నీషియం, జింక్, పాస్పరస్, అయోడిన్, ఐరన్, పొటాషియం, ఫోలేట్స్, విటమిన్-ఏ, విటమిన్-డీ, రైబోఫ్లేవిన్, విటమిన్ బీ-12, ప్రోటీన్, హెల్తీ ఫ్యాట్ వంటివి ఉంటాయి. నిత్యం సగటున ఒక మనిషికి 274 గ్రాముల పాలు, పాల పదార్థాలు అవసరం. మన దేశంలో ఒక్కో మనిషికి సగటున 186 గ్రాములు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. పలు ప్రాంతాల్లో 100 గ్రాములకు మించి పాల ఉత్పత్తులు అందటం లేదని నివేదికలు చెబుతున్నాయి.

రైతుల్లో పెరుగుతున్న అవగాహన



పాల ఉత్పత్తిపై రైతులకు అవగాహన పెరుగుతోంది. పాల ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుండటంతో పాడి పరిశ్రమపై కూడా రైతులు దృష్టి సారిస్తున్నారు. గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులు గేదెలను పెంచుకొని, వాటి ద్వారా పాడిని ఉత్పత్తి చేసేందుకు ఆసక్తిని కనబరుస్తున్నారు. స్థానికంగా పాలు విక్రయిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా డెయిరీలను ఏర్పాటు చేస్తున్న క్రమంలో ఖమ్మం జిల్లాలో పాల ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంది.

–మోహనమురళి, విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్, ఖమ్మం

ఆదివాసీ బాలికపై లైంగిక దాడి

- గర్భం దాల్చిన బాధితురాలు
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: వలస ఆదివాసీ బాలికపై వివాహితుడైన ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడగా బాలిక గర్భం దాల్చింది. పురిటి నొప్పులతో ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించడంతో ఆలస్యంగా ఈ ఘటన శనివారం రాత్రి వెలుగులోకి వచ్చింది. ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(14)పై అదే గ్రామానికి చెందిన మడకం సిరమయ్య తొమ్మిది నెలల క్రితం లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని రెండు నెలల క్రితం బాధితురాలు తల్లికి చెప్పింది. కాగా, అప్పటికే ఏడో నెల కావడంతో ఎవరికి చెప్పాలో తెలియక కుటుంబీకులు గోప్యంగా ఉంచారు. తొమ్మిది నెలలు నిండడంతో శనివారం రాత్రి పురిటి నొప్పులు రాగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు కాన్పు చేస్తున్న క్రమంలో భర్త అంగీకారం కావాలని తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో లైంగిక దాడి ఘటన వెలుగులోకి రాగా, వైద్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధురాలి నగదు అపహరణ

మణుగూరు టౌన్: రక్త పరీక్షల కోసం వచ్చిన వృద్ధురాలి నుంచి ఓ మహిళ నగదు అపహరించిన సంఘటన శనివారం మణుగూరు పట్టణంలో జరిగింది. సీఐ నాగబాబు కథనం ప్రకారం.. మండలంలోని పగిడేరుకి చెందిన వృద్ధురాలు శ్రీరాం అరుణ పట్టణంలోని ఓ బ్యాంక్ నుంచి రూ.1.50 లక్షల నగదు డ్రా చేసుకుని బ్యాగులో పెట్టుకుని రక్త పరీక్షల నిమిత్తం ఓ ప్రైవేట్ ల్యాబ్‌కు వెళ్లింది. రక్త పరీక్షలు చేయించుకుంటున్న క్రమంలో ఓ మహిళ నగదు చోరీ చేసి పరారైంది. ఆలస్యంగా గమనించిన వృద్ధురాలు ల్యాబ్ నిర్వాహకుడి సహకారంతో పోలీసులను సంప్రదించింది. సీఐ నాగబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.